

# మనిషి - విలువ

సాయంకాలం అయిదున్నర అయింది.

రామచంద్రం అప్పుడే కాఫీతాగి కూర్చున్నాడు, 'ఎక్కడికి వెళ్ళాలా?' అని ఆలోచిస్తూ. కొత్త ఊరవడంవల్ల అతడికి మరీ తోచకుండా ఉంది.

ముందున్న తోటలో లైన్‌మొక్కల గుబురులను కత్తిరించే ధ్వని వినిపిస్తోంది. పనుల నుంచి ఇళ్ళకు తిరిగివెళ్ళే కార్మికులు గొడవగా కబుర్లు చెప్పుకొంటూ పోతున్నారు బయట రోడ్డుపైన. చెట్లపైన వందలాది పక్షులు చేరి కిచకిచా కూడబలుక్కుంటున్నాయి. ఊరికి దూరంగా విసిరివేసినట్టుండే పెద్ద బంగళాలలో రామచంద్రం ఉంటున్నది ఒకటి. జనసంచారం ఎక్కువలేని ఆ పరిసరాలు బంగళా నిశ్శబ్దాన్ని మరింత ఎక్కువ చేస్తున్నాయి.